సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



తొమ్మిది మంది తమిళ స్మగ్లర్లు అరెస్టు

ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న 9మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి రూ. 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. - IIలో



సర్కారు భూమి.. అయితేనేం!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం వాటిని తొలగించి ప్రభుత్వ భూ ములను ఆక్రమించుకుంటున్నారు. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 196 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

లోక్‌కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



పత్రాలను అందజేస్తున్న శ్రీనివాసులు

రాజంపేట : కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన లోక్‌కళ్యాణ్‌మేళాను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎం స్వనిధి 2.0లో భాగంగా వీధి విక్రయదారులకు రుణ సదుపాయాలు, క్రెడిట్‌హామీ, వడ్డీ సబ్సిడీ లభిస్తాయన్నారు. మొదటి విడతలో రూ.15,000, రెండో విడతలో 25,000 మంజూరు అవుతాయన్నారు. యుపీఐ లింక్ రుపే క్రెడిట్ కార్డులు గరిష్ఠంగా రూ.30వేల వరకు అందజేస్తామన్నారు. కార్య క్రమంలో కార్మికశాఖ అధికారులు, కౌన్సిలర్లు, ఐసీడీఎస్ బ్యాంక్ ప్రతినిధులు, మెప్మా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి కేటాయింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

– జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి : ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏపీఎస్‌పీసీఎల్)కు లీజు ప్రాతిపదికన భూములు కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్‌ఏ జయలక్ష్మీ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ కేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటిలోని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన తూము కుంట, వెలిగల్లుకు సంబంధించిన లీజ్ ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం లోగా నివేదికలను అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి డీఎస్సీ అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఉమ్మ డి జిల్లావ్యాప్తంగా 869 అభ్యర్థులు కాగా వారి కుటుంబ సభ్యులతో కలిసి 1666 మంది బయలు దేరి వెళ్లారు. వారి కోసం 43 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. 122 సిబ్బందితోపాటు 15 మంది పోలీసుల భద్రతతో కలెక్టరేట్ ప్రాంగణం నుంచి బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్సీ అభ్యర్థులకు గురువారం నియామక పత్రాలు అందజేయనున్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా డీఈఓలు షేక్ షంషుద్దీన్, సుబ్రమణ్యం, సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్ : వాసవీమాతను ఊరేగిస్తున్న భక్తులు

మాతా ప్రణామం.. సదా నీ స్మరణం

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో దేవీ ఆలయాలు కళకళలాడుతున్నాయి. మూడోరోజైన బుధవారం అమ్మవారు వివిధరూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మాతా ప్రణామం..సదా నీ స్మరణం అని భక్తులు మొక్కుకున్నారు. కరుణించి.. కాపాడు తల్లీ అని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయచోటి టౌన్ : గాయత్రీ దేవి అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు



మదనపల్లె సిటీ : మీనాక్షిదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

ఆధరణ ఏది?

- రైతులకు ఫలితం ఇవ్వని అరటి
- చెట్లపైనే కాయలు ధర లేక వెతలు
- టన్ను రూ.5000కు పడిపోయిన ధైనం

సాక్షి రాయచోటి : పండ్ల తోటల రైతులు పతనమవుతున్నారు. కూటమి సర్కార్ పట్టించుకోకపోతే అన్నదాత నష్టాల ఊబిలోకి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. మొన్నటికి మొన్న టమాట, అంతకు ముందు మామిడి, పది రోజుల కిందట బొప్పాయి ధరలు పతనం కావడంతో తల్లడిల్లిన అన్నదాతకు గోరుచుట్టుపై రోకలి పోటులా అరటి ధరలు గణనీయంగా తగ్గిపోయాయి. వారం, పదిరోజుల ముందు వరకు రూ. 15–18 వేలు పలికిన టన్ను అరటి ఒక్కసారిగా రూ. 5–7 వేలలోపు పడిపోవడంతో రైతు కుదేలవుతున్నాడు. వ్యాపారుల తీరుపై భగ్గుమంటున్నారు. అయితే ఇతర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండడం, ఇతర అనేకకారణాలతోనే ధరలు తగ్గినట్లు ఉద్యానశాఖ అంచనా వేస్తోంది.

ఎంత కష్టం

పండ్ల తోటల రైతు పరిస్థితి చూస్తే అయ్యోపాపం అనిపించక మానదు. ప్రకృతి ప్రతిసారి ఏదో ఒక రూపంలో పంటలను దెబ్బతీస్తూనే ఉంది. గతంలోనూ పెనుగాలుల బీభత్సంతో అరటి, మామిడి, బొప్పాయి తోటలు నేలకూలాయి. ఈసారి దిగుబడులు ఆశాజనకంగా కనిపిస్తున్నా ధరలు లేక పోవడం చూసి రైతులు లబోదిబోమంటున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో మంచి ధరతో అమ్ముకుంటూ వచ్చారు. ఎప్పుడూ ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురు కాలేదు.



రవాణాకు సిద్ధం చేసిన అరటి గెలలు

అరటిలో అనేక రకాల సాగు

అన్నమయ్య జిల్లాలో అరటి పంట రైల్వేకోడూరు, రాజంపేటతోపాటు ఇతర ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేస్తారు. ప్రధానంగా సుగంధాలు, టిష్యూకల్చర్, చెక్కెర కేళి, అమృత పాణి, జీ9, ఏలకలు, రెడ్ బనానా సాగు చేస్తున్నారు. జిల్లాలో 13 వేల ఎకరాలకు పైగా సాగులో ఉంది. అనేక రకాల ప్రకృతి ఒడిదుడుకులు.....తెగుళ్లు, చీడపీడలను తట్టుకుని పంట చేతికి వచ్చిన తర్వాత ధర తగ్గించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అరటి ధర ఒక్కసారిగా పతనం కావడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలోనూ ఒక్కసారిగా బొప్పాయి ధరలను వ్యాపారులు భారీగా తగ్గించారు. అయితే తర్వాత ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో సమస్య కొంత సద్దుమణిగింది. ఈలోపే మళ్లీ అరటి ధరలు ఒక్కసారిగా టన్ను రూ. 5–7 వేల మధ్యకు రావడంపై ఏం జరిగిందన్నది అర్థం కావడం లేదు. ఇక్కడి అరటి ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, విజయవాడ ప్రాంతాలకు వెళుతుంటుంది. ఇటీవలి కాలం వరకు ధరలు బాగున్నా ఇప్పుడు పడిపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే 40 శాతంకు పైగా దిగుబడులు రైతులు అమ్ముకున్నట్లు ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా అరటి రైతు పరిస్థితి చూస్తే ధర లేక..కాయలు కోయలేక..ఏం చేయాలో అర్థం కాక అల్లాడి పోతున్నాడు.

విజయదశమికి పెరిగే అవకాశం

జిల్లాలో అరటికి సంబంధించి ఇప్పటికే 1.10 లక్షల టన్నులు విక్రయాలు జరిగాయి. ప్రస్తుతం రెండో క్రాప్‌కు సంబంధించి 70–75 వేల టన్నులు మాత్రమే ఉంటాయి. జూన్, జులై, ఆగస్టుల్లో మంచి ధరలు వచ్చాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండడం, ఇతర కారణాలతో కొంతమేర తగ్గాయి. విజయదశమి పండుగ నేపథ్యంలో ధరలు పెరిగే అవకాశం ఉంది.

– సుభాషిణి,
జిల్లా ఉద్యానశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

తీవ్రంగా నష్టపోయాం



ఆదాయం బాగుంటుందని ఈ ఏడాది 5 ఎకరాల్లో అరటి సాగు చేశాను. మొదట్లో రేటు బాగా ఉన్న కాయలు కోతకు వచ్చే సమయానికి ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. కాయలు కొట్టేందుకు వ్యాపారులు కూడా రాకపోవడంతో పొలంలోనే అరటికాయలు మాగిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడి కూలీల ఖర్చులు కూడా రాలేదు.

– టంగుటూరి రాజశేఖర్ రెడ్డి, పున్నాటివారిపల్లె, ఓబులవారిపల్లె

కోలుకోలేని స్థితిలో ఉన్నాం



అరటి ధరలు భారీగా పతనం కావడంతో కోలుకోలేని స్థితిలో ఉన్నాం. ఇప్పటికే నష్టాల్లో ఉన్న తాము గట్టెక్కుతామని భావించి అరటి సాగు చేశాం. తీరా పంట చేతికొచ్చే తరుణంలో ధరలు దారుణంగా పతనమయ్యాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తే పెట్టుబడులు సైతం చేతికి వచ్చే పరిస్థితులు లేవు. అందువల్ల పంటను కోయడానికి కూడా సాహసించడం లేదు.

– టి.ప్రభాకర్‌రెడ్డి, రైతు, అనంతపల్లి, పుల్లంపేట మండలం

'దేశం'లో.. విద్వేష మంటలు !

సాక్షి ప్రతినిధి, కడప : తెలుగుదేశం పార్టీలో ముదిరిన వర్గ విభేదాల కారణంగా కడప గడపలో ఉద్రిక్తత పెరిగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ప్రశాంత కడపలో ఏదొక రచ్చ జరుగుతూనే ఉంది. తాజాగా పచ్చ పార్టీలో వర్గ పోరు వీటికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే మాధవి రెడ్డి వైఖరిపై పాతకడప సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి నేతృత్వంలో ఓ వర్గం నిరశన చేపట్టిన విషయం తెలిసిందే. ఆపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి వద్దకు వెళ్లి కార్యకర్తలకు రక్షణగా నిలవాలంటూ అభ్యర్థించారు. ఇదంతా జరిగి మూడు రోజులైన గడవకముందే కృష్ణారెడ్డి లీజుకు తీసుకున్న ఓ గ్రావెల్ క్వారీలో ఉన్న జేసీబీని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మాధవి వర్గీయులు ధ్వంసం చేయడం వర్గపోరులో మరింత మంట రాజేసింది.

కడప నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి విశేషంగా పనిచేసిన నేతలంతా క్రమేపీ అసంతృప్తివాదులుగా మారారు. అందులో కొందరు మౌనం దాల్చితే.. మరికొందరు బాహాటంగా అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఈక్రమంలో అధిష్టానానికి ఫిర్యాదు చేశారనే నేపంతో నగర కమిటీ మాజీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై హత్యాయత్నం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే తనపై హత్యాయత్నం చోటు చేసుకున్నట్లు ఆ తర్వాత శివకొండారెడ్డి బహిర్గతం చేశారు. తాజాగా గత సోమవారం పాతకడప కృష్ణారెడ్డి దేవునికడపలో నిరశన చేపట్టి ఆ తర్వాత మాచిరెడ్డిపల్లెలో ఉన్న పుత్తా నరసింహారెడ్డిని కలిశారు. కడపలో టీడీపీ కార్యకర్తలకు రక్షణగా నిలవాలంటూ కోరారు. ఈ పరిస్థితుల్లో బుధవారం రాత్రి కృష్ణారెడ్డి లీజుకు తీసుకున్న ఓ గ్రావెల్ క్వారీలో ఉన్న జేసీబీని ధ్వంసం చేయడం గమనార్హం.

కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి వర్గీయులు అక్రమ క్వారీ నిర్వహిస్తూ గ్రావెల్ ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు. అధికారికంగా ఐదు క్వారీలు ఉండగా వాటికీ రాయల్టీ ఇవ్వకుండా మైనింగ్ అధికారులు శల్యసారథ్యం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన నేతలు పరపతి ఆధారంగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు.

ఘనంగా సంప్రోక్షణ కార్యక్రమం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు



బలి పీఠానికి సంప్రోక్షణ చేస్తున్న పండితులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం జీర్ణోద్ధరణ పనులు చేపట్టిన అనంతరం సంప్రోక్షణ కార్యక్రమాన్ని బుధవారం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. వేదపండితుడు రాజేష్ బట్టార్ ధ్వజస్తంభానికి, బలి పీఠానికి సంప్రోక్షణ, నివేదన, మంత్రపుష్పము నిర్వహించారు. టీటీడీ ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, టీటీడీ సివిల్ విభాగం ఏఈ అమరనాథ్‌రెడ్డి, ఆర్చకులు శ్రావణ్ కుమార్, వీణారాఘవచార్యులు, పవన్ కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన నాయకులు మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నిసార్ అహ్మద్, కొరముట్ల శ్రీనివాసులు, సురేష్ బాబు

యూరియా.. ఇవ్వండయ్యా!



బి.కొత్తకోటలో యూరియా కోసం మహిళలు, పురుషులు చెరోవైపు క్యూ

బి.కొత్తకోట : అయ్యా.. యూరియా ఇవ్వండయ్యా అంటూ బి.కొత్తకోటలో రైతులు బుధవారం తెల్లవారుజాము నుంచే రోడ్లపై క్యూ కట్టారు. ఇచ్చేది బస్తా.. దాని కోసం గంటల తరబడి క్యూలైన్లో నిలుచోవాలి. ఎప్పుడు స్టాక్ లేదని అంటారో అని మరోవైపు దిగులు. యూరియా కొరతలేదు అంటున్న కూటమి ప్రభుత్వానికి ఈ క్యూలైన్లు సమస్యను కళ్లకు కట్టినట్టు చూపుతున్నాయి. బి.కొత్తకోట గ్రోమోర్ కేంద్రానికి యూరియా వచ్చిందన్న సమాచారంతో ఉదయం ఆరు గంటలకే రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో కేంద్రం వద్దకు చేరుకున్నారు. గుంపుగా రావడంతో పోలీసులు క్యూలైన్ పెట్టారు. ఈ కేంద్రం నుంచి కేవలం 214 బస్తాలే పంపిణీ చేసి అయిపోయిందని చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. మండలంలోని గోళ్లపల్లెలో 214 బస్తాల యూరియాను అందించినట్టు వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణయ్య

గాలివీడు : గాలివీడు మండల పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. గాలివీడు నుంచి రాయచోటికి స్కూటీలో వెళుతున్న తిమ్మమ్మ మర్రిమానుకు చెందిన రమణయ్య, నరసింహులు వడిశిలంక పల్లెకు సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇరువురు గాయపడగా, రమణయ్య తలకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చిన్నప్ప

ములకలచెరువు : కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు చెందిన చిన్నప్ప(32) పెద్దపాళ్యం పంచాయతీ వీరాంజనేయపురానికి చెందిన లావణ్యను వివాహం చేసుకున్నాడు. తర్వాత కొద్ది నెలలకు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. దీనిపై మంగళవారం రాత్రి మొదటి భార్య లావణ్య ఇంటికి వచ్చిన చిన్నప్ప ఆమెతో గొడవ పడ్డాడు. అనంతరం మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడి వారు 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భార్యపై భర్త దాడి చేసిన ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. కురవంకకు చెందిన రామాంజులు భార్య భారతి (25) ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు డైట్ సరఫరా చేసే విభాగంలో పనిచేస్తుంది. బుధవారం సాయంత్రం ఆమె ఆస్పత్రుల్లో విధుల్లో ఉండగా, భర్త రామాంజులు అక్కడకు వచ్చి కుటుంబ సమస్యల కారణంగా ఆమెతో గొడవపడి, అక్కడే ఉన్న సాంబార్ బకెట్ ఆమె ముఖంపై పోసి దాడి చేశాడు. దాడిలో ఆమె గాయపడగా స్థానికులు అత్యవసర విభాగంలో చేర్పించి చికిత్స అందించారు.

తొమ్మిది మంది తమిళ స్మగ్లర్ల అరెస్టు



రాయచోటి: ఎర్రచందనం స్మగ్లర్లు, దుంగలతో జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, సీఐలు



పీలేరు:వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

- రూ. 34.40 లక్షలు విలువైన 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడి

రాయచోటి/సుండుపల్లె : ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి రూ. 34.40 లక్షలు విలువైన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. బుధవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎర్రచందనం స్మగ్లర్ల పట్టివేతపై ఎస్పీ వివరించారు. టి.సుండుపల్లి మండలం, మాచిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నారనే సమాచారం మేరకు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఆర్ఎస్‌టీఎఫ్ సీఐ మధు, కలికిరి సీఐ అనిల్‌ల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలు కాపు కాచాయన్నారు. బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని అడ్డుకోవడానికి ముందుకు వెళ్లగా కొంతమంది కారులో ఎక్కి పోలీసులను ఢీ కొట్టే ప్రయత్నం చేసి తప్పించుకున్నారన్నారు. వారిలో తొమ్మిది మందిని పోలీసులు పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే తరలించడానికి సిద్ధంగా ఉంచిన 344 కిలోల బరువుగల 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరువణ్ణామలై జిల్లాకు చెందిన బాకియరాజ్ అన్నామలై, రజిత్ కుమార్ గోవిందన్, జి.సామినాథన్, సురేష్ కుమార్, తిరుమలై చిన్నయాల్, వేలూరు జిల్లాకు చెందిన దురైసామి, రాజా మణి, పరశాంత్ చంద్రన్, రాజా విజయ కుమార్‌లు పట్టుబడిన వారిలో ఉన్నట్లు తెలిపారు. పారిపోయిన స్మగ్లర్లను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

ఎర్రచందనం వంటి విలువైన వనరులను అక్రమంగా రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అత్యంత విలువైన సహజ సంపదను దోపిడీ చేయడంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రజల భద్రత, ప్రకృతి వనరుల రక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. తమిళ స్మగ్లర్లను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం

పీలేరు : కారుతో సహా 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున యల్లమంద, పులిచెర్ల, మంగళంపేట మార్గాల్లో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేగంగా వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన ఇళయరాజాను అదుపులోకి తీసుకున్నారు. 10 ఎర్రచందనం దుంగలు, వాహనం విలువ రూ. 24.,82 లక్షలు చేస్తుందని వివరించారు. ఈ దాడిలో ఫారెస్ట్ అధికారులు చంద్రశేఖర్, ప్రకాష్‌కుమార్, ప్రతాప్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాను అరికట్టండి

ఓబులవారిపల్లె : బాలిరెడ్డిపల్లి, వై.కోట, పెద్దఓరంపాడు ప్రాంతాలలో నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ బంజరు, చెరువు ఆయకట్టు భూములను వందల ఎకరాలను కబ్జా చేస్తున్నారని, వాటిని అడ్డుకొని నిరుపేద దళిత, గిరిజన, ముస్లిం మైనార్టీ వర్గాలకు పంపిణీ చేయాలని బీకేఎంయూ నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిరెడ్డిపల్లి, వై.కోట సర్వే నెంబరు. 1155, 1194లలో దాదాపు 150 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమిలో నిరుపేద దళిత, ముస్లిం మైనార్టీలు గతంలో చెట్లను, రాళ్లను తొలగించి లక్షల రూపాయలు అప్పు చేసి అనుభవంలో ఉంచుకున్నారన్నారు. గతంలో ఉన్నతాధికారులు ఆ భూమిని పరిశీలించి అర్హులైన పేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు ఇస్తామని చెప్పారన్నారు. అయితే కొంతమంది రాజకీయ నాయకులు ఈ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వాటిని అడ్డుకొని పేదలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దశలవారీగా సామూహిక దీక్షలు చేపడతామన్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీకేఎంయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లిక, వెంకటరమణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య, మండల నాయకులు, కటారి గోపాలు, రాఘవులు, బాలాజీ నగర్, శివాజీ నగర్ గిరిజన పేద ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వర రావుకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పంపితే కఠిన చర్యలు

రాయచోటి : సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాలలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి హెచ్చరించారు. సోషల్ మీడియా మంచి విషయాలను పంచుకోవడానికి, దూరంగా ఉన్న మిత్రులు, బంధువులను దగ్గర చేయడానికి ఒక అద్భుత వేదిక అన్నారు. కానీ అదే వేదికను కొంత మంది అవాస్తవాలు, పుకార్లు, విద్వేషపూరిత పోస్టుల కోసం వాడుతుండటంతో శాంతి భద్రతలకు భంగం కలుగుతోందన్నారు. జిల్లా ఎస్పీ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గ్రూపుల్లో ఫేక్ న్యూస్ లేదా పుకార్లు వస్తే గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా పోస్టులు పెట్టరాదన్నారు. వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించవద్దని సూచించారు. మహిళలు, చిన్నారులపై అసభ్యకర పోస్టులు, ఫోటో మార్ఫింగ్ చేసినా సహించమన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు జిల్లా స్థాయిలో సైబర్ క్రైమ్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ అండ్ సోషల్ మీడియా సీఐ ఎస్.మహమ్మద్ అలీ, టెక్నికల్ అనాలసిస్ వింగ్ ఆర్ఐ టి.జాన్ జోసఫ్, సోషల్ మీడియా అండ్ సైబర్ సెల్, టెక్నికల్ అనాలసిస్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో కార్యాలయాల విభాగాలను సందర్శిస్తున్న ఎస్పీ

ఆయుధాల గది సందర్శన..

ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని ముఖ్యమైన విభాగాలను జిల్లా ఎస్పీ సందర్శించారు. ఆయుధాల గది, స్టోర్ రూమ్, అడిషనల్ ఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ వెల్ఫేర్, ఎంటీఓ, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, సైబర్ సెల్, ఐటీ కోర్ టీమ్, స్పెషల్ పార్టీ, మహిళా పోలీసు స్టేషన్, ట్రిబుల్ సి, కమ్యూనికేషన్, అడ్మినిస్ట్రేషన్, హోంగార్డ్స్ కార్యాలయాలను సందర్శించారు. ఆయన వెంట ఏఏఓ జె.త్రినాథ సత్యం, ఎస్బీ సీఐ పి.రాజా రమేష్, డీసీఆర్‌బీ సీఐ ఎం.తులసీ రామ్, క్రైమ్ సీఐ ఎం.చంద్రశేఖర్, టాస్క్‌ఫోర్స్ సీఐ టి.మధు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం చింతలవాండ్లపల్లె పరిధిలో జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.27,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 3 బైకులు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం



వైఎస్ జగన్‌తో కొరముట్ల, అజయ్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : కార్యకర్తలకే పార్టీలో ప్రాధాన్యం ఇచ్చి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కడప పార్లమెంట్ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలోని పలు అంశాలను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసేలా ఇన్‌చార్జులు, నాయకులు బాధ్యత తీసుకోవాలని వైఎస్ జగన్ ఆదేశించినట్లు తెలిపారు. అన్ని కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించినట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు రెడ్డెప్ప

మదనపల్లె రూరల్ : పొలం విషయమై జరిగిన గొడవలో, తనను కొట్టారన్న మనస్తాపంతో వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. ఎనుములవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప(80) పొలం వద్ద పశువులు మేపుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన వేణు, కాంతమ్మ, ఉదయ్‌కుమార్ మరికొందరితో కలిసి అక్కడికి వచ్చారు. పొలం విషయమై రెడ్డెప్పతో గొడవపడి కొట్టారు. విషయం తెలుసుకున్న భార్య సరస్వతి అక్కడకు వచ్చి తన భర్తను ఎందుకు కొట్టారని ప్రశ్నించగా ఆమెపై సైతం ప్రత్యర్థులు దాడిచేశారు. దీంతో మనస్తాపం చెందిన రెడ్డెప్ప పంటకు పిచికారీ చేసేందుకు తెచ్చి ఉంచిన పురుగుల మందు పొలం వద్ద తాగి పడిపోయాడు. అనంతరం గ్రామస్తుల సహాయంతో ఆమె రెడ్డెప్పను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించింది. జరిగిన ఘటనపై తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం

బాస్ నేషనల్ కోఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు

మదనపల్లె రూరల్ : ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు భారతీయ అంబేద్కర్ సేన(బాస్) నేషనల్ కోఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు స్పష్టంచేశారు. సెప్టెంబర్ 24 పూనా ఒప్పంద దుర్దినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే), బాస్ ఆధ్వర్యంలో రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గం సుబ్బారావు మాట్లాడుతూ.. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలతో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలు, మహిళలు, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ వర్గాలు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారన్నారు. విద్య,వైద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడంతో 85శాతం అవకాశాలు ప్రైవేట్‌రంగంలోకి వెళ్లిపోయాయన్నారు. ప్రభుత్వం వద్దే ఉన్న 15శాతం ఉద్యోగ అవకాశాలు రిజర్వేషన్ వర్గాలకు దక్కడం లేదన్నారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ,ఎస్టీలకు 25శాతం నిధులు కేటాయించేందుకు చేసిన సబ్‌ప్లాన్ చట్టాలు అమలుకావడం లేదన్నారు. ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో బాస్, వీసీకే నాయకులు కే.వి.రమణ, పల్లంతాతయ్య, ముత్యాలమోహన్, పాలకుంట శ్రీనివాసులు, కడప రమణ, నంద్యాల శ్రీపతి, నీరుగట్టిరమణ, పీర్‌బాషా, వి.దొరస్వామి, అనంతపురం ఓబులేషు, కర్నాటక డీఎస్ఎస్ మునెప్ప, శ్రీనివాసులు, మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పిస్తున్న బాస్ నేషనల్ కోఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు

మృత్యువులా దూసుకొచ్చిన లారీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- గువ్వలచెరువు ఘాట్‌లో దుర్ఘటన



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చింతకొమ్మదిన్నె /లక్కిరెడ్డిపల్లె: చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్ జాతీయ రహదారిపై రాయచోటి వైపు నుంచి అతివేగంతో దూసుకొచ్చిన లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవహనాన్ని ఢీకొనడంతో కొప్పల లక్ష్మయ్య (60) మృతి చెందాడు. కొప్పల. ఈశ్వరయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం రాయచోటి వైపు నుంచి ఎలక్ట్రికల్ పరికరాలతో కూడిన గూడ్స్ లారీ వేగంగా రావడంతో నాలుగో మలుపు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద లారీని డ్రైవర్ అదుపుచేయలేక లారీ డ్రైవర్ కిందికి దూకేశాడు. ఆ సమయంలో రోడ్డుకు అవతలవైపున ఎదురుగా గువ్వలచెరువు వెపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు ఈశ్వరయ్య గమనించి ద్విచక్రవాహనాన్ని ఆపే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న కొప్పల లక్ష్మయ్యను లోయవైపు ఈడ్చుకుపోగా కుడి కాలు, కుడి చేయి తెగి పడి, సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ద్విచక్రవాహనంలోని మరో వ్యక్తి కొప్పల ఈశ్వరయ్యకు గాయలయ్యాయి. లారీ డ్రైవర్ లారీ లోయ వైపు దూసుకెళ్లే క్రమంలో లారీ నుండి ముందే దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మయ్య, గాయపడిన ఈశ్వరయ్య సమీప బంధువులే. వీరిది లక్కిరెడ్డిపల్లె మండలంలోని దప్పేపల్లె రామాపురం గ్రామం.

సర్కారు భూమి.. అయితేనేం!

- ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డులు ఉన్నా లెక్కచేయని కూటమి నేతలు
- యథేచ్ఛగా ఆక్రమణలు



వత్తలూరు వద్ద చదును చేసిన ప్రభుత్వ భూమి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూచిక బోర్డులు యథేచ్ఛగా తొలగించి దర్జాగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. పుల్లంపేట మండలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. పేదవారికి సెంటు భూమి ఇవ్వాలంటే సవాలక్ష ఆంక్షలు. దోచుకున్నవారికి దోచుకున్నంత చందంగా ప్రస్తుత పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వానికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు అధికమవుతున్నాయి. రాత్రివేళల్లో ప్రభుత్వ భూమిని చదును చేయడం, పగటిపూట నిర్మానుష్యంగా ఉండటం పరిపాటిగా మారింది. పుల్లంపేట మండలం, వత్తలూరు పంచాయతీ సర్వే నంబరు 1, 2, 3లలో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. అలాగే అనంతయ్యగారిపల్లిలో ఏపీ మోడల్ స్కూల్ వెనుకవైపున డంపింగ్ యార్డు వద్ద (చెత్త నుండి సంపద కేంద్రం) రాత్రులలో భూమిని చదును చేయడం, పగలు పనులు ఆపివేయడం జరుగుతోంది. రోజురోజుకు ఆక్రమణదారులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. అలాగే పెరియవరం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు. 143, 144,145లలో తోపు పొరంబోకు భూమి ఉంది. ఈ భూమిని గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు చట్ట విరుద్ధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పక్కనే ఉన్న స్మశానం సైతం ఆక్రమణకు గురైంది. పలుమార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా కూటమి అండతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. గతంలో వీఆర్‌ఓగా పనిచేసిన మల్లికార్జున కాసులకు కక్కుర్తిపడి జిల్లా అధికారులకు తప్పుడు నివేదికలు అందించారు. అలాగే రంగంపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు. 417లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి నాయకులు ఆక్రమించుకొని చెట్లను పెంచుతున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు పుల్లంపేటలోని భూ ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రోన్ సాయంతో జూదరుల అరెస్ట్

మదనపల్లె రూరల్ : డ్రోన్ సహాయంతో పేకాట స్థావరంపై దాడిచేసి 9 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని వేంపల్లె పంచాయతీ కూకటిమానుగడ్డ సమీపంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో డ్రోన్‌ను వినియోగించి పేకాట స్థావరాన్ని గుర్తించి ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. దాడిలో పీటీఎం మండలం మడుమూరు పంచాయతీ ఆములదార్లపల్లెకు చెందిన గుర్రంకొండ నరేంద్ర(42), మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ కూకటిమానుగడ్డకు చెందిన జి.వెంకటరమణ(53)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. అయితే అక్కడి నుంచి కొందరు పారిపోగా, వారిలో కూకటిమానుగడ్డకు చెందిన అక్కిగారి రమేష్, జంగాలపల్లెకు చెందిన పులిపాకల చెన్నకేశవులు, కోసువారిపల్లె పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన బాలక్కగారి రామిరెడ్డి, అలాగే కర్నాటక రాయల్పాడుకు చెందిన వంశీ, మదనపల్లెటౌన్, నక్కలదిన్నె వెంకటస్వామి, పందివారిపల్లె పూస భూపతి, పి.రమేష్ గా గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. పేకాట స్థావరంలో నిర్వహించిన దాడుల్లో నిందితుల నుంచి రూ.8,400 నగదు, రెండు మొబైల్ ఫోన్‌లు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

కువైట్‌లో ములకలచెరువు మహిళ అవస్థలు

ములకలచెరువు : మండలంలోని నాయనచెరువుపల్లి పంచాయతీ పోకనాటువారిపల్లెకు చెందిన రమణప్ప భార్య నాగమణి మూడు నెలల క్రితం కువైట్ దేశానికి బతుకుదెరువు కోసం వెళ్లింది. ఆమె భర్త రమణప్పకు అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో వెళ్లింది. అక్కడికి వెళ్లగానే అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. దీంతో అక్కడే ఆసుపత్రిలో చేరింది. డబ్బు ఎక్కువ ఖర్చు అవుతుందని అక్కడి కువైట్ యజమానులు పట్టించుకోవడం లేదు. ఇండియా నుంచి కువైట్‌కు పంపిన బ్రోకర్‌ను సంప్రదిస్తే రూ.2 లక్షలు ఖర్చు చేస్తే కువైట్ నుంచి ఇంటికి పిలిపిస్తామని చెబుతున్నాడంటూ రమణప్ప కంటతడి పెడుతున్నాడు. ఆరోగ్య సమస్య ఎక్కువైందని తనను ఇండియాకు పిలిపించాలని నాగవేణి ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.



ప్రభుత్వం సహాయం అందించాలని వేడుకుంటున్న నాగమణి

అవయవదానంతో ఏడుగురి జీవితాలకు వెలుగు




బెంగళూరు ఆసుపత్రిలో వంశీధర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

రాయచోటి : ఓ ప్రైవేట్ ఉద్యోగి అవయవదానం ఏడుగురి జీవితాలలో వెలుగులు నింపింది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం అరవీటివాండ్లపల్లికు చెందిన వంశీధర్‌రెడ్డి (25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన రాయచోటి నుంచి గాలివీడుకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. మణిపాల్ ఆసుపత్రి వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయినట్లు తేల్చారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి వైద్య బృందం వంశీధర్‌రెడ్డి తల్లి కళ్యాణికి అవయవదానంపై బుధవారం అవగాహన కల్పించారు. వైద్యుల సూచనలను ఆమె అంగీకరించారు. దీంతో వంశీధర్‌రెడ్డి నుంచి గుండె, కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు సేకరించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అమర్చారు. అంతేకాకుండా కంటి కార్నియాలను కూడా సేకరించినట్లు వైద్యులు అంజనార్రైన పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీంతో ఆ యువకుడు మృతి చెందినా ఏడుగురిలో జీవం పోసుకోవడం విశేషం. అవయవదానం అనంతరం మృతదేహాన్ని గాలివీడు మండలంలోని ఆయన స్వగృహానికి తరలించారు.

భర్త ఇంటి ముందు ధర్నా

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామంలో భర్త ఇంటి ముందు అతని భార్య ధర్నా చేసిన సంఘటన బుధవారం జరిగింది. ఆమె కథనం మేరకు ఓబులవారిపల్లి మండలం ఎల్లాయపల్లి గ్రామానికి చెందిన జయలక్ష్మీకి మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన కుంచం సురేష్‌తో దాదాపు 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు సంతానం. సురేష్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లోని కతర్ దేశాలకు వెళ్లి వస్తూ ఉంటాడు. సురేష్ ఇతర దేశాల్లో ఉండటం వల్ల జయలక్ష్మీ తన పుట్టింట్లో ఉంటోంది. తన మామ ఆస్తి కావాలని సురేష్ గొడవ పెట్టుకుని సుమారు 6 నెలల నుంచి జయలక్ష్మీకి డబ్బులు పంపడం కానీ మాట్లాడటం కానీ చేయడం లేదు. నెల రోజుల క్రితం సురేష్ ఇంటికి వచ్చిన విషయం తెలిసి జయలక్ష్మీ భర్తకు ఫోన్ చేయగా ఆస్తిలో సగం భాగం తనకు ఇస్తేనే సంసారానికి తీసుకొని వస్తానని చెప్పి సురేష్ ఫోన్ పెట్టేశాడు. దీంతో జయలక్ష్మీ పాటూరు గ్రామానికి వచ్చి సురేష్ సోదరుడి ఇంటిముందు ధర్నాకు దిగింది ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ లేరు. భార్యాభర్తల మధ్య గొడవ రావడానికి కారణం సురేష్ అన్న కుంచం గోపాలకృష్ణయ్య అని జయలక్ష్మీ ఆరోపిస్తోంది. తనకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటోంది.



తనకు న్యాయం చేయాలని ఇద్దరు పిల్లలతో కూర్చున్న బాధితురాలు

జరిమానా విధిస్తారా? మాఫీ చేస్తారా!

ఎస్ఆర్‌సీ అక్రమ తవ్వకాలపై మీనమేషాలు లెక్కిస్తున్న మైనింగ్‌శాఖ

జమ్మలమడుగు : జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రహదారి నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ, మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండానే భారీగా కొండను తవ్వి గ్రావెల్‌ను తరలించారు. ఈ విషయం సాక్షి దినపత్రికలో రావడంతో మైనింగ్‌శాఖ అధికారుల్లో కాస్త చలనం వచ్చింది. ఈనెల 10 వతేదీ జమ్మలమడుగు-ముద్దనూరు రహదారి అంబవరం పంచాయతీ పరిధిలో అక్రమంగా కొండను తవ్వి గ్రావెల్‌ను ఎత్తుకు వెళ్లిన ప్రాంతాన్ని అధికారులు సందర్శించారు. అనంతరం అక్రమంగా ఎంత మైనింగ్ చేశారో కొలతలు తీసుకున్నారు. వచ్చిన అధికారులు అక్రమ మైనింగ్‌పై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఆ తర్వాత వారు చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానాలు విధిస్తారని చెప్పి వెళ్లిపోయారు.

22 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం..

నంద్యాల-జమ్మలమడుగు 167వ జాతీయ రహదారి నిర్మాణం కోసం టెండర్ 80 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. అందులో జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో 22 కిలోమీటర్ల మేర పనులు చేయడంతోపాటు, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ పనులను దక్కించుకున్న ఎస్ఆర్‌సీ కంపెనీ గత మూడు నెలలుగా పనులు ప్రారంభించింది. రోడ్డు పనుల కోసం కావలసిన గ్రావెల్ కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఇప్పటికే దాదాపు సగానికి పైగా పనులు పూర్తి చేశారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు తెలుపుతున్నారు. రహదారి నిర్మాణం కోసం కావలసిన గ్రావెల్‌ను కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా మొత్తం కొండను తవ్వి రహదారి నిర్మాణం చేశారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజుకు రెండు వందల టిప్పర్ల వంతున అక్రమంగా గ్రావెల్‌ను తీసుకు వెళ్లారు. ఇదంతా స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులకు తెలిసినా అటువైపు తొంగి చూడని పరిస్థితి ఉంది. అధికారులు దాడులు చేసి అక్రమంగా తవ్విన గ్రావెల్ కొలతలు తీసుకుపోయిన మరుసటిరోజు నుంచే యథావిధిగా అక్రమ మైనింగ్ చేసి గ్రావెల్‌ను తరలిస్తున్నారు.